క్లుప్తంగా

ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

సీటీఆర్ఐ: గెయిల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో కోటగుమ్మం సమీపంలోని అర్బన్ విద్యాశాఖ కార్యాలయం వద్ద నిర్మించిన టీచర్స్ రిసోర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎంపీ భరత్ రామ్ శనివారం ప్రారంభించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, సమగ్ర శిక్షా అధికారి ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: రెండు దశాబ్దాలుగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంపీ మార్గాని భరత్ రామ్ చర్యలు తీసుకున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. స్థానిక 36వ వార్డు 3వ వీధి చీకట్ల కృష్ణాకర్ వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ఏఈ పిల్లి ప్రసాద్, పార్టీ నాయకులు నందం స్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే



అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణను సత్కరిస్తున్న సభ్యులు

సీటీఆర్ఐ: మానవాళికి వెలుతురు ప్రసాదించిన మహానుభావుడు థామస్ అల్వా ఎడిసన్ అని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అన్నారు. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా శనివారం స్థానిక దేవీచౌక్ నుంచి కంబాల చెరువు, మెయిన్ రోడ్డు మీదుగా విక్రమ్ హాల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. విక్రమ్ హాల్లో థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్లకు ప్రభుత్వం ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ఎంపీ భరత్ రామ్ శ్రామిక భవన నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం కమిటీ సభ్యులకు, వివిధ సంఘాల వారికి మెమెంటోలు అందించి, సత్కరించారు. రాజమహేంద్రవరం ప్లంబర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వంద లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో శనివారం దాడులు నిర్వహించి ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ చేసి వంద లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఒకరిని అరెస్టు చేశామన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి

ప్రకాశం నగర్: దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని మూల్ నివాసి కర్మచారి కల్యాణ్ మహా సంఘ జాతీయ అధ్యక్షుడు కె.తిలక్ కుమార్ అన్నారు. దివాన్ చెరువులోని డీవీబీ రాజు టౌన్ షిప్‌లో మహా సంఘ రాష్ట్ర సదస్సు జరిగింది.

వాంబే కాలనీలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన ఇంటిలో ఈ నెల 5వ తేదీన ఎవరూ లేని సమయంలో మూడు కాసులు బంగారం వస్తువులు, రూ.45 వేలు చోరీ చేశారని రత్నంపేట వాంబే కాలనీకి చెందిన కె.రమణమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల రణభేరికి సిద్ధం కావాలి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల రణభేరికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. హుకుంపేట డీమార్ట్ పక్కన గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన రూరల్ నియోజకవర్గ పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులతో వచ్చినా, జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మనకు ఆయుధాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో పది రోజుల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్యం తదితర పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు మంత్రి వేణు అన్నారు. శనివారం ఆయన



ఆర్‌అండ్‌బీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

హుకుంపేట పంచాయతీ పరిధిలోని శాంతిపురంలో రూ.24 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.2.20 కోట్లతో ఐఎల్‌టీడీ నుంచి బొమ్మూరు, రాజవోలు నుంచి కేశవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ రహదారుల పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ బీవీ మధుసూదనరావు, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ సంపత్, నగరపాలకసంస్థ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులు రెడ్డి, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసీడి ప్రసాద్‌బాబు (రాజమౌళి), హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాసరావు, చిర్రా గణేష్, బండి నాగేశ్వరరావు, అంగాడి సత్యప్రియ పాల్గొన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత

కడియం: దేశాన్ని రక్షించేందుకు సైనికులు ఏ విధంగా పనిచేస్తారో.. పారిశుధ్య నిర్వహణలో కార్మికులు కూడా అంతే బాధ్యతతో పనిచేస్తారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కడియం మండలం వేమగిరి తోటలో పర్యటించారు. స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమాన్ని చేపట్టారు. రాజమహేంద్రవరం రూరల్‌లో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం ద్వారా చెత్తను తొలగిస్తూ పరిశుభ్రత దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. మూడు రోజులుగా ధవళేశ్వరంలో కార్యక్రమం చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చామన్నారు.తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న టీకుమూడి రమణ పరిస్థితిని గమనించి ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ప్రియాంకకు ఫోన్ చేసి ఆరోగ్యశ్రీ ద్వారా తక్షణం వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. దివ్యాంగుడైన గుత్తుల సత్యనారాయణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వ సేవలు అందుతున్న తీరును ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్, పార్టీ నాయకులు గుబ్బల నాగార్జున, కట్టా సత్య సురేష్, నరాల గణపతి, నరాల మోహన్, బడుగు ప్రశాంత కుమార్, కాగిత రాజు, విప్పర్తి ఫణి కుమార్, ఎంపీడీవో కె.రత్నకుమారి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి



మహిళలకు కేక్ తినిపిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- ఆసరా నమూనా చెక్కు అందజేత

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 37, 38, 31, 32 డివిజన్ల స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల నమూనా చెక్కును శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో జీవించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దాదాపు సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుమీదే ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల శ్రేయస్సు కోరుకునే జగనన్నకు సంపూర్ణ మద్దతు అందించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, అరిగెల బాబు, సబ్బారపు సూరిబాబు, ముప్పన శ్రీను, ముత్యాల వీర అప్పారావు, లంకా ప్రసాద్, బాలాజీ రెడ్డి, కట్టా వెంకటేశ్ పాల్గొన్నారు.

నగరంలో విజయదుందుభి మోగించాలి

రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించేందుకు ప్రతి కార్యకర్తా సుశిక్షితుడైన సైనికుడి మాదిరిగా కదన రంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులు పిలుపు నిచ్చారు. స్థానిక వీఎల్ పురం ఎంపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణుల



కార్యకర్తలతో సమావేశమైన ఎంపీ భరత్‌రామ్

విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని పిలుపు నిచ్చారు. జగన్ పాలనలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, శోభాయమానంగా తీర్చిదిద్దామన్నారు. క్షేత్ర స్థాయి నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మనం అందరం ఒక కుటుంబ సభ్యులమేనని పార్టీ గెలిస్తే అందరూ గెలిచినట్లే అన్నారు. కార్యక్రమంలో సంకిస భవానీ ప్రియ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గోపాల్ నగర్ పుంతలో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనా స్థలాన్ని ఎంపీ భరత్‌రామ్ శనివారం పరిశీలించారు. ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితుడు చెల్లుబోయిన దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులకు ఎంపీ ఆర్థిక సాయం చేశారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

రామకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: పడాల రామకృష్ణారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘంలోని ఐసీయూలో ఉన్న రోగులకు ఆక్సిజన్ బెడ్ సెబ్యులైజర్ కిట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మా తాత పడాల రామకృష్ణారెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో గౌతమీ జీవకారుణ్య సంఘంలో 2022 మార్చి 28న ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగనన్న ఐసీయూ కేర్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సంఘంలోని వృద్ధులు అనారోగ్యానికి గురైన ఈ జగనన్న ఐసీయూ కేర్‌లో చికిత్స అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవ



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న షర్మిలారెడ్డి

కారుణ్య సంఘం డాక్టర్ అశోక్ కుమార్, వెలగల పద్మావతి, బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్, ఎస్సీ యువ నాయకులు కాటం సంజయ్ కాంత్, మాడెం శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తేజస్వినికి డాక్టరేట్

సీటీఆర్ఐ: ప్రభుత్వ అటానమస్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు గార తేజస్విని డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. 'లోహ ఆక్సైడ్లు హరితనానో సంశ్లేషణ – వాటిని జీవ సంబంధ కాలుష్య నివారణకు ఉపయోగించడం' అనే అంశంపై డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో తేజస్విని పరిశోధన చేసి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్ సమన్వయకర్త డాక్టర్ ఈసుబ్ బాషా, రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, డాక్టర్ బి.మల్లికార్జున, జొన్నకూటి యాకోబ్, ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

నేడు ఆర్యవైశ్య మహాసభ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యవైశ్య మహాసభ సర్వసభ్య సమావేశం ఏపీఐఐసీ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య ప్రముఖుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో స్థానిక చెరుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట రమణ(బాబీ) తెలిపారు.

తిరుకల్యాణ మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో వెంకటగిరికొండపై కొలువైన లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారి 24వ తిరుకల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముంగి గిరిధరరావు, సుజాతరాణి దంపతులతో శైవగామ పండితుడు కాళ్లకూరి సూర్యశ్రీ (సూరిపండు), ఆలయ ప్రధాన అర్చకుడు నండూరి శ్రీకృష్ణపరమాత్మ జరిపించారు. వంశపారంపర్య ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలు

రాజమహేంద్రవరం రూరల్: విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, సద్గుణ రామారెడ్డి, లారీ శ్రీను, తోడేటి రాజా పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

ఆకట్టుకునే 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ మేళం'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఫిబ్రవరి 2న విడుదల కానున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ మేళం' చిత్రం అన్ని వర్గాలనూ అలరిస్తుందని హీరో సుహాస్, హీరోయిన్ శివాని చెప్పారు. ఈ చిత్రం ప్రమోషన్ వర్క్ లో భాగంగా చిత్రబృందం రాజమహేంద్రవరం విచ్చేసింది. హోటల్ షెల్టాన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో సుహాస్ మాట్లాడుతూ కవల పిల్లలైన అక్కా తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంఘటన ఆధారంగా వాళ్ల జీవితాలు ఎలా మలుపు తిరిగాయన్నదే ఈ చిత్ర ఇతివృత్తమన్నారు. ప్రసన్న వదనం, కేబుల్ రెడ్డి సినిమాలతో పాటు దిల్ రాజు సినిమాలో నటిస్తున్నట్లు తెలిపారు. హీరోయిన్ శివాని మాట్లాడుతూ సినిమాను అందరూ చూసి విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న హీరో సుహాస్, చిత్రంలో హీరోయిన్ శివాని

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

సీటీఆర్ఐ: పార్టీలకతీతంగా శ్రీకృష్ణదేవరాయల జయంతిని నగరంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఆనం రోటరీ హాల్లో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. సినీ నటుడు చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు రావడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆకుల వీర్రాజు, అద్దేపల్లి శ్రీధర్, కాపు నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయలక్ష్మి

బాలికలను రక్షించిన రైల్వే పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: విశాఖపట్నంలో తప్పిపోయి రైలులో వెళుతున్న ఇద్దరు బాలికలను సురక్షితంగా రక్షించి, వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు రాజమహేంద్రవరం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..శుక్రవారం రాత్రి విశాఖపట్నం న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ నుంచి మనీషా కుమారి(15) కిరణ్ కుమారి (14) అనే అక్కాచెల్లెళ్లు కనిపించడం లేదనే వచ్చిన సమాచారం వచ్చింది. దీంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే రైళ్లను తనిఖీ చేపట్టగా, ట్రైన్ నెంబర్ 20805 ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో వారిని గుర్తించారు. వెంటనే విశాఖపట్నం న్యూపోర్ట్ పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. శనివారం రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్‌కు వచ్చిన వారి కుటుంబ సభ్యులకు బాలికలను అప్పగించారు.



బాలికలతో రైల్వే పోలీసులు